కామారెడ్డి డిక్లరేషన్‌ను మర్చిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరమేశ్ నాయీ

పెబ్బేరు, ఆగస్టు 4 : బీసీలకు రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరమేశ్ నాయీ డిమాండ్ చేశారు. బీసీ కులగణన చేపడతామని ఎన్నికల ముందు కామారెడ్డిలో చేసిన డిక్లరేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని ఆదివారం ఆయన ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన హామీలలో కుల గణనతో పాటు బీసీ రిజర్వేషన్ 42శాతం పెంపు అంశాలున్నాయన్నారు. ఇప్పుడు ఇవేమి పట్టించుకోకుండా ఎన్నికలకు సిద్ధం కావడం శోచనీయమన్నారు. బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ డిక్లరేషన్ అమలు చేసి గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధు పథకాన్ని కొనసాగించాలని పరమేశ్ నాయీ డిమాండ్ చేశారు.

అసంపూర్తి రోడ్డు పనులను పూర్తి చేయాలి

అసంపూర్తి రోడ్డును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెబ్బేరు, ఆగస్టు 4 : పట్టణంలోని సుభాష్ చౌరస్తా నుంచి వనపర్తికి వెళ్లే రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అసంపూర్తి పనులను పరిశీలించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరంజన్‌రెడ్డి మంత్రిగా కొనసాగిన సమయంలో ఈ రోడ్డు నిర్మాణాన్ని మొదలు పెట్టి 75శాతం పూర్తి చేసినట్లు వారు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మిగిలిపోయిన 25శాతం పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారని వారు అన్నారు. త్వరగా చర్యలు తీసుకొని రోడ్డు పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎల్లయ్య, సహదేవుడు, శ్రీధర్‌రెడ్డి, వెంకటన్న గౌడ్, శాంతన్న, బస్వరాజుగౌడ్, శేఖరాచారి, సిద్ధిరాములు పాల్గొన్నారు.

మహిళలు హక్కుల సాధనకు ఉద్యమించాలి

మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోతి

వనపర్తి టౌన్, ఆగస్టు 4: మహిళలు సమాజంపై బాధ్యతగా వ్యవహరిస్తూ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోతి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీనిక ఫంక్షన్‌హాల్‌లోని జిల్లా అధ్యక్షురాలు ఉమా అధ్యక్షతన నిర్వహించిన మహిళా సంఘం మూడో జిల్లా మహాసభల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలన్నారు. మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలు చేసినా ఫలితం లేదన్నారు. అదేవిధంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత మాట్లాడుతూ మహిళలు లేని ఉద్యమాలు పోరాటాలు లేవని వివరించారు. ప్రభుత్వాలు మహిళా రక్షణ కోసం పనిచేస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో వైఫల్యం చెందుతున్నారని సరైన రక్షణ లేకపోవడం మూలంగానే దాడులు పెరిగిపోతున్నాయన్నారు. పోరాటాలే ఏకైన మార్గంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మహాసభలో జిల్లా కార్యదర్శి లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి సువర్ణ, కవిత, శాంతమ్మ, లక్ష్మి ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గూడెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కృష్ణసాగర్

చిన్నంబావి, ఆగస్టు 4 : కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తున్నందున నది ఎగువ ప్రాంతం నుంచి మొసళ్లు, పాములు గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉందని పరివాహక ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్ అన్నారు. మండలంలోని గూడెం గ్రామంలో ఆదివారం పర్యావరణం, పాములపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాములు, మొసళ్లు కనపడితే వెంటనే సమాచారం అందించాలని చెప్పారు. అదేవిధంగా పెబ్బేరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాణి మాట్లాడుతూ మొసళ్లు, కొండ చిలువలు , పాములు, జింకలు మొదలైన అడవి వన్యప్రాణులకు హాని తలపెట్టరాదని అన్నారు. హాని తలపెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో స్నేక్ సొసైటీ సభ్యులు కుమార్, గోపాల్, లోకేశ్, దేవేందర్, నవీన్‌ముదిరాజ్ అవినాష్, గ్రామస్తులు, యువకులు ఉన్నారు.

ర్యాలంపాడులో 1.58 టీఎంసీల నీటి నిల్వ

గట్టు, ఆగస్టు 4 : నెట్టంపాడులో భాగమైన ర్యాలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి వరద ప్రవాహం కొనసాగుతున్నది. రిజర్వాయర్‌లో ఆదివారం నాటికి 1.58టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 600 క్యూసెక్కులు. రిజర్వాయర్ నుంచి ఎడమ కాల్వ(104ప్యాకేజీ)కు 286 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా, కుడి కాల్వకు 765 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా ర్యాలంపాడు రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 4టీఎంసీలు కాగా కట్ట బలహీనంగా ఉండడంతో 2టీఎంసీల లోపు వరకే నీటిని నిల్వ ఉండేటట్లు చూస్తున్నారు.

మార్లబీడు పంప్‌హౌస్ నుంచి ర్యాలంపాడులోకి వస్తున్న వరద

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PUBLIC HEALTH CHEMICALS
టెమీ ఫాస్ 50% EC, మలాథియన్ 50% EC, పైరిత్రమ్ 2% EC, డెల్టామెత్రిన్ 1.25% ULV, MLO ఆయిల్, పైరోసిన్ ఆయిల్ etc. మునిసిల్ కార్పొరేషన్స్‌కి, గ్రామ పంచాయతీలకి మరియు నగర పంచాయతీలకి సప్లై చేయబడును. డీలర్స్ మరియు మునిసిపల్ కాంట్రాక్టర్స్ సంప్రదించవలసిన నంబర్లు
9346771599, 8790185234, 9701298656

WANTED
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325783-All

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆలయాలకు పోటెత్తారు

- ఆదివారం అమావాస్య ప్రత్యేక పూజలు
- మొక్కులు చెల్లించుకొన్న భక్తులు
- ఏర్పాట్లను పరిశీలించిన ఆలయ కమిటీలు
- పోలీసుల బందోబస్తు

మల్దకల్‌లో స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని ఉదయాన్నే ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకొన్నారు. అర్చకులు అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గట్టు, ఆగస్టు 4 : గట్టుతోపాటు వివిధ గ్రామాల్లో అమావాస్య పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ఆలయాలను భక్తులు అధిక సంఖ్యలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గట్టు గండి ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మాచర్లలోని చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారిని అందంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జములమ్మ సన్నిధిలో రమ్య ఇండస్ట్రీస్ అధినేత

గద్వాల రూరల్, ఆగస్టు 4 : నడిగడ్డ ఇలవేల్పు జములమ్మను రమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆదివారం అమావాస్య సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ ఈవో పురేందర్ స్వాగతం పలికి అర్చన చేయించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సతీశ్, అర్చకులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, ఆగస్టు 4 : జిల్లా కేంద్రంలోని 7వ వార్డు పీర్లగుట్ట పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే మేఘారెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలో ఉండే ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆ దేవుని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నక్క రాములు, జంపన్న, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, ఆలయ కమిటీ సభ్యులు వెంకటస్వామి, బాలస్వామి, కాలనీవాసులు అరవింద్‌నాయక్, తిరుపతినాయక్ ఉన్నారు.

అమావాస్య పూజలు

ఎర్రవల్లి చౌరస్తా, ఆగస్టు 4: ఎర్రవల్లి చౌరస్తాలోని శివాలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బీచుపల్లిలో ప్రత్యేక పూజలు

ఇటిక్యాల, ఆగస్టు 4: ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని బీచుపల్లి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఉదయాన్నే అర్చకులు ప్రహ్లాదాచారి, మారుతాచారి, సందీపాచారి, వాల్మీకి పూజారులు స్వామివారికి బిందెసేవ, పంచామృతాభిషేకం, ఆకుపూజ, మహ మంగళహారతి, తీర్థప్రసాదాల నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం అమావాస్య ప్రత్యేక దినం కావడంతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయ కమిటీవారు అన్ని ఏర్పాట్లను చేపట్టారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి రామన్‌గౌడ్ పర్యవేక్షించారు.



బీచుపల్లి క్షేత్రంలో స్వామివారి దర్శనానికి క్యూలైన్ లో వేచి ఉన్న భక్తులు

పెద్ద చింతరేవులలో ..

ధరూరు, ఆగస్టు 4 : పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయానికి ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.

రథోత్సవం.. రమణీయం

అయిజ, ఆగస్టు 4: పంచముఖ ఆంజనేయస్వామి రథోత్సవంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తెలంగాణ సరిహద్దులోని రాయిచూరు జిల్లాలోని గణదళంలో వెలిసిన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో భాజాభజంత్రీలు.. మేళ తాళాలు.. పండితుల వేదమంత్రోచ్చారణలు.. భక్తుల శ్రీరామ జయరామ నామాల నడుమ ఆంజనేయస్వామి రథోత్సవం రమణీయంగా నిర్వహించారు. ఆదివారం అమావాస్య కావడంతో తెలంగాణ, కర్ణాటక, ఏపీ భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అర్చకులు స్వామివారికి అభిషేకం, ఆకుపూజ, పుష్పాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే అయిజలోని తిక్కవీరేశ్వర స్వామికి భక్తులు విశేష పూజలు చేశారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని తిక్కవీరేశ్వరస్వామిని ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఉదయం అభిషేకం, అలంకరణ, పుష్పాభిషేకం, అర్చనలు నిర్వహించారు. అలాగే అయిజ పట్టణంలోని స్వయంభూ కట్టకింద తిమ్మప్ప స్వామి, వీరబ్రహ్మేంద్ర శివరామాంజనేయ స్వామి, ఉత్తనూర్ ధన్వంతరి వేంకటేశ్వరస్వామి, భ్రమరాంబిక, గుంతరామలింగేశ్వరస్వామి, తుపత్రాల ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

జోగులాంబ ఆలయంలో చండీహోమం

అలంపూర్, ఆగస్టు 4: జోగులాంబ ఆలయం యాగశాలలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని అర్చకులు చండీహోమం నిర్వహించారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ.వెయ్యి రుసుం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చెల్లించాలని ఈవో పురేందర్‌కుమార్ పేర్కొన్నారు. ఆలయంలో ఆదివారం నిర్వహించిన చండీహోమంలో 414మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ సమీపంలోని తుంగభద్రా నదిలో పవిత్ర స్నానాలు చేసి ఆలయ దర్శనం చేసుకున్నారు. అమావాస్యను పురస్కరించుకొని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఎంపీ రఘునందన్‌రావు దంపతులు దర్శించుకున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం

ఖిల్లాఘణపురం, ఆగస్టు 4: మండల కేంద్రంలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు స్వామివారికి అర్చన, అభిషేకాలు నిర్వహించి ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. అనంతరం సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి , పద్మ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కమ్మరి గోపి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సప్తాహ భజనలు

మల్దకల్ ఆగస్టు 4 : ఆదిశిలా క్షేత్రంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి. ఆదివారం మల్దకల్, పెద్దొడ్డి ,మల్లెందొడ్డి, బింగిదొడ్డి, చిన్న తాండ్రపాడు, మంగంపేట, పర్దిపురం తదితర గ్రామాలకు చెందిన భజన భక్తులు పాల్గొన్నారు. అలాగే ఆదివారం అమావాస్య పురస్కరించుకొని కర్ణాటక ప్రాంతం రాయిచూర్, బళ్లారి , ఆంధ్రా ప్రాంతం నుంచి కర్నూల్, గుంతకల్లు, ఎమ్మిగనూర్ నుంచే కాక నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు కాకతీయ టెక్నో పాఠశాల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి, అర్చకులు ధీరేంద్రదాస్, రవిచారి, మధుసూదనాచారి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గౌరీ మాతాకు పూజలు

మల్దకల్, ఆగస్టు 4 : ఆషాఢ మాసం చివరిరోజు అమావాస్య పురస్కరించుకొని మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో మహిళలు గౌరీ మాతా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల పూలు, పండ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు గౌరీ మాత వ్రతం నిర్వహించారు.

చికిత్స పేరుతో అధిక వసూళ్లు

- స్థాయికి మించి చికిత్స అందిస్తున్నట్లు గ్రామీణ వైద్యుడిపై ఆరోపణలు
- లోతుగా విచారణ చేపట్టిన వైద్య శాఖ అధికారులు

గద్వాల అర్బన్, ఆగస్టు 4 : ఓ గ్రామీణ వైద్యుడు స్థాయికి మించి చికిత్స అందిస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. స్థానికుల కథనం ప్రకారం గద్వాల మండలంలోని గోనుపాడు గ్రామానికి చెందిన ఓ యువకుడు అనారోగ్యానికి గురయ్యాడు.దీంతో తల్లిదండ్రులు ఓ గ్రామీణ వైద్యుడికి చూపించగా..యువకుడిని పరీక్షించి రక్తనమునాలు సేకరించి పరీక్షించగా టైఫాడ్ జ్వరమని నిర్ధారించి అందుకు సంబంధించి చికిత్స అందించాడు. అయితే యువకుడికి జ్వరం తగ్గకపోవడంతో తల్లిదండ్రులు మరో గ్రామీణ వైద్యుడిని సంప్రదించి మరోమారు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు రిపోర్టులు రెండు వేర్వేరుగా ఉండడంతో యువకుడి తల్లిదండ్రులు మొదటి గ్రామీణ వైద్యుడిని నిలదీసినట్లు తెలిసింది. ఈ విషయంపై యువకుడి బంధువులు పంచాయితీ పెట్టి గ్రామీణ వైద్యుడితో డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిసింది. గ్రామీణ వైద్యుడు బైక్‌తోపాటు ప్రథమ చికిత్స బ్యాగ్‌ను యువకుడి బంధువులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జిల్లా వైద్య శాఖ అధికారి సిద్ధప్ప స్పందించి.. విచారణ అధికారిగా ఏంజల్ నియమించి విచారించాలని ఆదేశించారు. వైద్య అధికారి ఏంజల్ గ్రామాన్ని సందర్శించి అనారోగ్యానికి గురైన వ్యక్తిని పరిశీలించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం గ్రామీణ వైద్యుడిని ఆరా తీసేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదని ,ఈ విషయంపై పూర్తి విషయాలను సేకరిస్తున్నట్లు విలేకరులకు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

రాజోళి, ఆగస్టు 4: తుమ్మిళ్ల ఎత్తిపోతల మోటర్లు ఆన్‌చేసి నడిగడ్డ రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల మోటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తుంగభద్ర నది నుంచి కొనసాగుతున్న వరదను ఉపయోగించుకుని తుమ్మిళ్ల ఎల్లిపోతల మోటర్ల ద్వారా నీటిని తోడాలని, ప్రస్తుతం 50వేల ఎకరాల రైతులు నీటి విడుదలకు వేచి చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజగోపాల్, రాజోళి మండలాధ్యక్షుడు సంజీవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శాఖాహారమే ముద్దు

ఆత్మకూరు, ఆగస్టు 4 : మాంసాహారం వద్దు శాఖాహారమే ముద్దు అని హనుమ పిరమిడ్ ధ్యానమందిరం ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు అవగాహన కల్పిస్తూ ఆదివారం పట్టణంలో భక్తులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆంజనేయరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, శివరాములు, శ్రీనివాస్ గౌడ్, రఘుపతిరెడ్డి, మంజుల, పల్లవి, వెంకటేశ్, రాజు, ఫిరమిడ్ ధ్యాన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఫిరమిడ్ ధ్యాన ప్రతినిధులు

ఆర్డీఎస్ ఆయకట్టుకు నీటి విడుదల

అయిజ, ఆగస్టు 4: ఆర్డీఎస్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయడంతో వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది తుంగభద్ర డ్యాం పరివాహక ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో తుంగభద్ర జలాశయం నిండడంతో దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నీరు చేరడంతో ప్రధానకాల్వకు నీటిని విడుదల చేశారు. ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయడంతో రైతులు నారుమళ్లు పోసుకున్నారు. అయిజ మండలంలోని ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. 15 రోజుల్లో వరినాట్లు వేసేందుకు కసరత్తు చేస్తున్నారు. బోర్లు, బావుల వద్ద నారుమళ్లు సిద్ధం చేసుకున్న కొందరు రైతులు నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. వానకాలంలో ఆర్డీఎస్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వరద జలాలతోపాటు ఆర్డీఎస్ ఆయకట్టుకు కేటాయించిన నీటిని ఆయకట్టుకు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మేడికొండలో ఆర్డీఎస్ ప్రధానకాల్వలో పారుతున్న నీరు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల పోస్ట్‌కార్డు ఉద్యమం

వనపర్తి టౌన్, ఆగస్టు 4 : ఇటీవల సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రాలకు అధికారాలు కల్పించడం కోసం ఇచ్చిన ఆదేశాలకు నిరసనగా ఆదివారం జిల్లా కేంద్రంలోని మాల మహానాడు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని ఆదివారం ప్రారంభించినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు రాష్ట్రాలకు ఇచ్చిన తీర్పును సమీక్షించి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తన వైఖరిని మార్చుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టి ఆర్టికల్ 341 కాపాడుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాల ఉద్యోగులు కంటె నిరంజనయ్య, మోజర్ల కృష్ణ, చెన్నకేశవులు, ఆంజనేయులు, వెంకటస్వామి, రాంబాబు, బండారు శ్రీనివాసులు, డాక్టర్ శ్రీకర్, రిటైర్డ్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఆవుల కురుమూర్తి, ఆర్టీసీ కంట్రోలర్ బాలస్వామి, శ్రీనివాసులు, దాసరి కృష్ణ, సంధ్యారాణి, నాగన్న, నాగేశ్వర్, జిల్లా కోర్టు ఉద్యోగులు జెట్టి మోహన్, రామకృష్ణ, బాలు, నవీన్, విష్ణు, రామకృష్ణ, బాను , హుస్సేన్, వెంకటేశ్ ఉన్నారు.

పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న నేతలు

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన లాయర్‌పై కేసు

అలంపూర్, ఆగస్టు 4: విధుల్లో ఉన్న పోలీసులకు ఆటంకం కలిగించిన లాయర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నాగరాజు తెలిపారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా జోగుళాంబ ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ వద్ద రద్దీ పెరగడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో అలంపూర్ ఎస్సై పట్టణంలో ఆలయం వరకు వాహనాలను అనుమతించకుండా కోర్టు పరిసరాల్లో పార్కింగ్ చేయించారు. ఆలయ దర్శనం కోసం కర్నూలు పట్టణానికి చెందిన లాయర్ మనోహర్ రాగా.. వాహనాన్ని అక్కడే నిలిపి నడుచుకుంటూ వెళ్లాలని పోలీసులు చెప్పగా.. నేను లాయర్‌ను వెళ్తానని ముందుకెళ్లే ప్రయత్నం చేశాడు. ఈ దిశలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. లాయర్ మనోహర్ పక్కనే విధుల్లో ఉన్న ఎస్సై చెంపపై కొట్టాడు. విధుల్లో ఉన్న ఉద్యోగిపై చేయి చేసుకోవడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించినందుకు లాయర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎస్సై ప్రవర్తనపై ఆలయ ఉద్యోగుల నిరసన

ఆదివారం ఆలయ దర్శనం కోసం పలువురు ప్రముఖులు భారీగా తరలివచ్చారు. వారివారి సేవల్లో ఓ వైపు ఆలయ ఉద్యోగులు, మరోవైపు పోలీసులు బిజీగా అయ్యారు. ఇదిలా ఉండగా ఒకానొక సందర్భంలో ఆలయ ప్రవేశ గేట్లు తెరవలేదని ఎస్సై నాగరాజు ఆలయ సీనియర్ అసిస్టెంట్ చంద్రయ్యాచారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడని, అజమాయిషి చేస్తూ వార్నింగ్ కూడా ఇచ్చారని ఆలయ ఉద్యోగులు ఆదివారం రాత్రి నల్లబ్యాడ్జీలు ధరించి ఆలయ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆలయ ఉద్యోగులు

వరద నీటితో చెరువులను నింపాలి

అయిజ, ఆగస్టు 4: రిజర్వాయర్లు, చెరువులను వరద నీటితో నింపి ఆయకట్టుకు అందించాలని అయిజ అఖిలపక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అఖిలపక్ష కమిటీ నాయకులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ నాయకులు మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా వాగులు, వంకలు ప్రవహించకపోవడంతో చెరువుల్లో నీరు చేరలేదన్నారు. కృష్ణా, తుంగభద్ర నదులు పొంగి ప్రవహిస్తున్నప్పటికీ నెట్టెంపాడ్ ప్రాజెక్టు పరిధిలోని ముచ్చోనిపల్లి, తాటికుంట, నాగర్‌దొడ్డి రిజర్వాయర్లు, అయిజ పట్టణానికి సమీపంలోని బింగిదొడ్డి చెరువుకు నీటిని విడుదల చేయకపోవడంతో ఒట్టిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వాయర్లు, చెరువులను నీటితో నింపితే ఆయకట్టు సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు భూగర్భజలాలు పెరిగి బోర్లలో నీళ్లు పుష్కలంగా వస్తాయన్నారు. అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు రెండు జీవనదులు పొంగి ప్రవహిస్తున్నా చెరువులు, రిజర్వాయర్లను నింపడంలో ప్రభుత్వం విఫలమవుతందని విమర్శించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెద్దమందడి, ఆగస్టు 4 : మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 1994–95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 30 ఏండ్ల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులందరూ ఆనాటి స్నేహ బంధాన్ని, జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం వారికి విద్యను బోధించిన ఉపాధ్యాయులు శివరాజలింగం, కృష్ణయ్య, సత్యనారాయణశెట్టిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పరశురాములు, చారి, కరుణాకర్‌రెడ్డి, కొండన్న, బాల్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

ఖిల్లాఘణపురం, ఆగస్టు 4 : మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 2009–2010 బ్యాచ్‌లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 13 ఏండ్ల తర్వాత కలిసిన స్నేహితులు ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకొని సంతోషంగా గడిపారు. అనంతరం కేక్ కట్ చేసి స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పెద్దమందడి, ఖిల్లాఘణపురం జెడ్పీహెచ్ఎస్‌ల పూర్వ విద్యార్థులు

మాజీ సర్పంచుకు నివాళి

కొత్తకోట, ఆగస్టు 4 : మండలంలోని చర్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సాయిరెడ్డి శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారితో పాటు తాజామాజీ జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, కానాయపల్లి మాజీ సర్పంచ్ పోతులపల్లి యాదయ్యాసాగర్, కొత్తకోట బాలయ్యానాయుడు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట, ఆగస్టు 4 : మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సంజీవరెడ్డి తండ్రి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సాయిరెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, విశ్వేశ్వర్, చెన్నకేశవరెడ్డి, ప్రశాంత్, నర్సింహాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

పెద్దమందడి, ఆగస్టు 4 : మండలంలోని జగత్‌పల్లి గ్రామానికి చెందిన తోకలి తిరుపతయ్య డెంగీ వ్యాధితో గత నెలలో మృతిచెందాడు. మృతుడికి భార్య చిట్టెమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో విషయం తెలుసుకున్న మహా రుషి ఫౌండేషన్ సభ్యులు ఆదివారం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి పిల్లల చదువుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వెంకట నారాయణ, ఉమ్మళ్ల రాములు, కావలి బాలస్వామి, బోయ మురళి, ఎర్ర రవి, వాల్మీకి సంఘం నాయకులు బుచ్చన్న, వెంకటయ్య, గట్టయ్య, విష్ణు, తిరుపతయ్య, వెంకటయ్య, నిరంజన్, చెన్నయ్య, కుర్మయ్య ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబురాలు

గట్టు, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణ సబబేనని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన క్రమంలో సంబురాలు కొనసాగుతున్నాయి. మండలంలోని బలిగేరలోని మెథడిస్ట్ చర్చిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలను నిర్వమించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాచర్లలో వ్యవసాయ అనుబంధ రంగాల్లోని కూలీలు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

కృష్ణమ్మకు తగ్గిన వరద

నదిలో స్నానమాచరిస్తున్న భక్తులు

ఇటిక్యాల, ఆగస్టు 4: నాలుగైదు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన కృష్ణమ్మకు వరద ఉధృతి కాస్త తగ్గింది. బీచుపల్లి క్షేత్రం పుష్కరఘాట్ చెంత ప్రమాద స్థాయిలో ప్రవహించిన నది ప్రస్తుతం పుష్కరఘాట్ మెట్లకు దిగువగా ప్రవహిస్తోంది. ప్రస్తుతం 2లక్షలకు క్యూసెక్కులకుపైగా వరద నీరు దిగువకు ప్రవహిస్తోందని అధికారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో వరద ఉధృతి మరింత తగ్గనుందని వారంటున్నారు.